నీళ్ల కోసం కాంగ్రెస్‌ను ఉరికించి కొడతాం

- కాంగ్రెసోళ్లు బాబు బూట్లు నాకేటోళ్లు
- అందుకే ప్రాజెక్టులు కేఆర్‌ఎంబీకి
- ఇక యుద్ధం మొదలు పెట్టాల్సిందే
- మిర్యాలగూడ బీఆర్ఎస్ సమావేశంలో ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి ఆగ్రహం
- రాహుల్ బి చోడో యాత్ర

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్

బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి వేముల, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, భాస్కర్‌రావు, రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, విజయసింహారెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 5: చంద్రబాబు బూట్లు నాకే కాంగ్రెస్ నేతల అసమర్థత కారణంగానే కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పాల్సిన దుస్థితి వచ్చిందని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ నీళ్ల కోసం కేసీఆర్ పోరాటం చేస్తారని, కాంగ్రెస్ నాయకులను ఉరికించి కొడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు దద్దమ్మలని, కేసీఆర్ వస్తుండనగానే వాళ్ల లాగులు తడుస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఆ అక్కసుతోనే సీఎం రేవంత్‌రెడ్డి అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి ఇవ్వడం అంటే ఆంధ్రాకు అప్పనంగా నీటిని రాసివ్వడమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేతికానితనం వల్ల సాగర్ డ్యామ్ మన చేతుల్లో నుంచి వెళ్లిపోయిందని చెప్పారు. సాగర్ ఎడమ కాల్వ రైతాంగం మళ్లీ తిరోగమనం అయ్యే పరిస్థితి వచ్చిందని, సాగర్ డ్యామ్ కేంద్ర బలగాల చేతుల్లోకి పోయిందని, మనం అక్కడ అడుగు పెట్టే పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. ఇక యుద్ధం మొదలు పెట్టాల్సిందేనని, కాంగ్రెస్‌ను తరిమికొట్టాల్సిందేనని బీఆర్ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టండని మంత్రి కోమటిరెడ్డి అనడం ఆయన అహంకారానికి నిదర్శనమని దుయ్యబట్టారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ ప్రాజెక్టు పనులను ఆపితే మంత్రి కోమటిరెడ్డిని ప్రజలే చెప్పులతో కొడ్తారని హెచ్చరించారు.

రాహుల్‌గాంధీది చోడోయాత్ర

కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన జోడోయాత్ర చోడోయాత్రగా మారిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఇండియా కూటమి పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ముక్కలైందని ఎద్దేవా చేశారు. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ కాంగ్రెస్‌కు 40-50 ఎంపీ స్థానాలు రావడం కూడా గగనమేనని వ్యాఖ్యానించారని, దీనిని బట్టి ఆ పార్టీ పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. కాంగ్రెస్ ధోరణి నచ్చకనే కూటమిలో భాగస్వాములైన కేజ్రీవాల్, నితీశ్‌కుమార్, మమతాబెనర్జీ వంటి కీలక నేతలు విడిపోయారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీది నడమంత్రపు సంసారమేనని, ముందుకు సాగేది కాదని పేర్కొన్నారు. 2014 తరువాత ఆ పార్టీ ఏ రాష్ట్రంలోనూ రెండోసారి అధికారంలోకి రాలేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి, తిరునగరు భార్గవ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే రాజమల్లు కన్నుమూత

సుల్తానాబాద్, ఫిబ్రవరి 5 : పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు (74) సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పదిరోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేరారు. ఆ తర్వాత వైద్యుల సూచనతో హైదరాబాద్‌లోని నివాసానికి తరలించారు. సోమవారం తెల్లవారుజామున ఆకస్మాత్తుగా మరోసారి గుండెపోటు రావటంతో మృతిచెందారు. ఎమ్మెల్యే విజయరమణారావు నివాళులర్పించారు. దుబాయ్‌లో ఉన్న ఆయన కొడుకు వచ్చాక మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

నల్లగొండ బైపాస్ రోడ్డుకు లైన్ క్లియర్

- కేంద్ర రహదారుల మంత్రిత్వశాఖ ఓకే
- రూ.700 కోట్లతో రోడ్డుకు సన్నాహాలు
- 11న కేంద్రమంత్రి గడ్కరీతో శంకుస్థాపన

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): నల్లగొండలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి లైన్‌క్లియర్ అయింది. కేంద్ర సర్కారు నుంచి ప్రాథమిక అనుమతులు లభించాయి. ఈ నెల 11న కేంద్రమంత్రి గడ్కరీ శంకుస్థాపన చేస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం నల్లగొండ మీదుగా వెళ్తున్న మూడు రహదారుల వాహనాలను పట్టణం బయటి నుంచే మలిపేవిధంగా బైపాస్ రోడ్డు ఏర్పాటుచేయాలని ఆర్‌అండ్‌బీశాఖ ప్రతిపాదించింది. 15 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణానికి రూ.700 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించారు. ఇందులో భూసేకరణకే రూ.130 కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. నల్లగొండలోకి ప్రవేశిస్తున్న వాహనాల సంఖ్య, పట్టణంలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలు, బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలు, దీనికి అయ్యే ఖర్చు తదితర అంశాలపై అధికారులు సమగ్ర నివేదిక రూపొందించారు. ఇటీవల రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్రమంత్రి గడ్కరీకి ఆ నివేదికను సమర్పించారు. దీనికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. పూర్తి వివరాలు సమర్పించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరింది. ఈ నెల ఏడున రాష్ట్ర అధికారులు కేంద్ర రహదారుల మంత్రిత్వశాఖ అధికారులతో సమావేశమై వారు కోరిన వివరాలను సమర్పించనున్నారు.

రాజన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

వేములవాడ రాజన్న క్షేత్రం సోమవారం భక్తజన సంద్రమైంది. దాదాపు 80 వేల మంది భక్తులు తరలివచ్చారు. గండదీపాలు, సత్యనారాయణ వ్రతాలు, కల్యాణాలు, చండీహోమాల నిర్వహణతోపాటు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అర్జిత సేవల ద్వారా రాజన్నకు సుమారు రూ.37 లక్షల ఆదాయం సమకూరినట్టు అధికారులు వెల్లడించారు. -వేములవాడ టౌన్

పాలమూరు, నల్లగొండను ఎండబెడతారా?

ఆలేరు బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి. చిత్రంలో జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సునీత, భిక్షమయ్యగౌడ్ తదితరులు

- ప్రాజెక్టుల అప్పగింతపై అఖిలపక్షం ఎందుకు పెట్టలేదు?
- కాంగ్రెస్‌ను ప్రజలే బొందపెడతారు
- ఆలేరు బీఆర్ఎస్ సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం ద్వారా పాలమూరు, నల్లగొండ జిల్లాలను ఎండబెట్టాలనుకుంటున్నారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టుల అప్పగింతపై అఖిలపక్ష సమావేశం ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో సోమవారం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ఆలేరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ కుతంత్రాలతో సాగునీటితో పాటు విద్యుత్తు సమస్య కూడా ఉత్పన్నతమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. 811 టీఎంసీల్లో 50% తెలంగాణకు దక్కాల్సిందేనని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం అనే విషయాన్ని మర్చిపోయి, ఇంకా పీసీసీ అధ్యక్షుడిగానే వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌ను బొందపెట్టే వ్యక్తి లేడని, ఇకపై పుట్టబోడని, రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్‌ను బొందపెట్టబోతున్నారని చెప్పారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, ఎన్‌డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు సుదగాని హరిశంకర్‌గౌడ్, తుంగ బాలు తదితరులు పాల్గొన్నారు.

చెప్పు చూపిస్తూ మాట్లాడుతున్న బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

కాంగ్రెస్‌ను రాజకీయంగా దెబ్బ కొట్టాలి

- హామీల అమలు కోసం పోరాడుదాం
- మంచిర్యాల బీఆర్ఎస్ సమావేశంలో నిరంజన్‌రెడ్డి
- రేవంత్‌ను చెప్పుతో కొట్టాలి: బాల్క సుమన్

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 5: అబద్ధాలు, దుష్ప్రచారంతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా దెబ్బకొట్టాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మంచిర్యాల, పెద్దపల్లిలో నిర్వహించిన ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్నారు. ఆయా సమావేశాలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండు నెలల్లోనే కాంగ్రెస్ బండారం బయటపడిందని, ఇప్పుడు ప్రజలు తాము తప్పు చేశామన్న భావనలోకి వచ్చారని తెలిపారు. బీఆర్ఎస్‌కు మళ్లీ మంచిరోజులొస్తాయని చెప్పారు. హామీల అమలు చేతకాకపోతే తప్పుకోవాలని, సన్నాసులమని ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.

రేవంత్‌ను చెప్పుతో కొట్టాలి

కేసీఆర్ గురించి బుడ్డర్‌ఖాన్, సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న తీరు చూస్తుంటే చెప్పుతో కొట్టాలనిపిస్తున్నదని, కానీ తనకు సంస్కారం అడ్డు వస్తున్నదని బాల్క సుమన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన చెప్పును ప్రదర్శిస్తూ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ హయాంలో ఏ ఒక్క నాయకుడినీ పరుష పదజాలంతో దూషించలేదని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని చెప్పారు. ఉద్యమానికి వెన్నుపోటు పొడిచినా కాంగ్రెస్ నాయకులను క్షమించి వదిలేశామని చెప్పారు. రైతుబంధు కోసం గత ప్రభుత్వం విడుదల చేసిన రూ.7,700 కోట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి, కాంగ్రెస్ కాంట్రాక్టర్లకి జేబుల్లోకి మళ్లించారని ఆరోపించారు.

బాల్క సుమన్‌పై కేసు

మంచిర్యాల ఏసీపీ, ఫిబ్రవరి 5: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై సోమవారం మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు 294బీ, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మర్రి చెట్లపై గంగాజలం ఝరి భద్రం

మంచిర్యాల జిల్లాలోని కలమడుగు వద్ద గోదావరి నదిలోని హస్తలమడుగులో గత నెల 28న గంగాజలంతో బయల్దేరిన మెస్రం వంశీయులు సోమవారం రాత్రి కేస్లాపూర్ మర్రి చెట్ల వద్దకు చేరుకున్నారు. ఇంద్రవెల్లిలోని ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేశారు. మర్రిచెట్ల వద్ద గంగాజలం ఝరితో నాలుగు రోజులు బసచేస్తారు. 9న మర్రిచెట్ల నుంచి గోవాడ్‌కు నాగోబా జాతర కోసం చేరుకోనున్నారు. -ఇంద్రవెల్లి

'వ్యూహం'పై 9లోగా నిర్ణయం

- సీబీఎఫ్‌సీ రివైజింగ్ కమిటీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): దర్శకుడు రాంగోపాల్ వర్మ రూపొందించిన వివాదాస్పద 'వ్యూహం' చిత్రాన్ని ఈ నెల 9లోగా వీక్షించి, సెన్సార్ సర్టిఫికెట్ జారీపై నిర్ణయాన్ని ఆ సినిమా నిర్మాతకు, దర్శకుడికి తెలియజేయాలని హైకోర్టు సీబీఎఫ్‌సీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్) రివైజింగ్ కమిటీని ఆదేశించింది. ఈ చిత్రంలో మాజీ సీఎం చంద్రబాబు ప్రతిష్ఠను దెబ్బతీసే లా సన్నివేశాలు ఉన్నాయని పిటిషన్ వేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు అనుకూలంగా హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చిన విషయం విదితమే.

ముగిసిన శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు

- తిరుపతినీ ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధి చేస్తాం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): తిరుమలలో శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన సదస్సులో 62 మంది మఠాధిపతులు, పీఠాధిపతులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మూడు రోజులపాటు జరిగిన ధార్మిక సదస్సులో అనేక తీర్మానాలు చేశామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి వెల్లడించారు. హిందూ మతాన్ని నమ్మి, ఈ ధర్మాన్ని ఆచరించాలన్న ఇతర మతస్థులకు తిరుమల క్షేత్రంలో ఒక వేదిక ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇతర మతస్థులు హిందూ మతంలోకి మారేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తే, తిరుమలలో మతమార్పిడి చేయించి వారికి శ్రీవారి దర్శనభాగ్యం కల్పిస్తామని తెలిపారు. ప్రవచన కర్తలకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. తిరుపతిని కూడా తిరుమల తరహాలో ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. యువతలో ధార్మిక భావాన్ని పెంచేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. తిరుమలలో ఉన్న 108 తీర్థాలను భక్తులు సందర్శించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

రేవంత్.. నోరు అదుపులో పెట్టుకో

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు
- రెండు నెలల్లోనే కాంగ్రెస్‌పై వ్యతిరేకత
- కరీంనగర్, మానకొండూర్ బీఆర్ఎస్ సమావేశాల్లో బోయినపల్లి వినోద్‌కుమార్
- త్యాగాలతోనే తెలంగాణ సుభిక్షం: గంగుల

కరీంనగర్ బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్. చిత్రంలో మాజీ మంత్రి గంగుల తదితరులు

కరీంనగర్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. రేవంత్‌రెడ్డిని నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఇలాంటి వ్యక్తి సీఎం కావడం తెలంగాణ ప్రజల దురదృష్టమని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్, మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోతున్నదని, రెండు నెలల్లోనే ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని చెప్పారు. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదని, పూర్తి అసమర్థతతో వ్యవహరిస్తున్నదని విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలు నిలబెట్టుకోకుంటే ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కే పరిస్థితులు వస్తున్నాయని చెప్పారు. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరిచేందుకు వెళ్లిన తనపై మహారాష్ట్ర ప్రభుత్వం కేసులు పెట్టిందని, ఈ నెల 28న కోర్టులో కేసు విచారణకు హాజరు కావాల్సి ఉన్నదని తెలిపారు. తామెన్నో త్యాగాలు చేస్తే తప్ప తెలంగాణ సుభిక్షం కాలేదని చెప్పారు. సమావేశాల్లో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సర్కార్‌పై రెండు నెలల్లోనే అసంతృప్తి

- నారాయణపేట బీఆర్ఎస్ సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్

నారాయణపేట, ఫిబ్రవరి 5: సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడం లేదని, ఆయన తీరుతో ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోయే పరిస్థితి ఉన్నదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, అంజయ్యయాదవ్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామాల్లోని రైతులు, పింఛన్ లబ్ధిదారులు ఆలోచనలో పడ్డారని తెలిపారు. రేవంత్ నోటి దూలతో పరిస్థితి మారుతున్నదని చెప్పారు. రెండు నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి మొదలైందని పేర్కొన్నారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అసత్య ఆరోపణలు మానుకొని ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి సారించాలని హితవు పలికారు.

ఇల్లెందులో కౌన్సిలర్ కిడ్నాప్ కలకలం!

- ఎమ్మెల్యే కోరం, అనుచరులపై కేసు
- బల్దియా చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం
- 17 మందికి 15 సభ్యుల హాజరు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మున్సిపల్ కార్యాలయానికి వస్తున్న కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావును అపహరించి తీసుకెళ్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అనుచరులు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ)/ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై సోమవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం కిడ్నాప్ హైడ్రామా, ఉద్రిక్తతల నడుమ వీగిపోయింది. మున్సిపల్ చైర్మన్‌పై 19 మంది కౌన్సిలర్లు అసమ్మతి ప్రకటించారు. గతనెల 19న కలెక్టర్ ప్రియాంక ఆలను కలిసి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్, కొత్తగూడెం ఆర్డీవో శిరీష అవిశ్వాస తీర్మానం కోసం సమావేశం నిర్వహించారు. కోరం పూర్తి కావాలంటే సమావేశానికి మొత్తం సభ్యులు 24 మంది, ఎక్స్‌అఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యేతో కలిపి కనీసం 17 మంది హాజరు కావాల్సి ఉండగా, కేవలం 15 మంది హాజరయ్యారు. అయినప్పటికీ 12 గంటలకు 15 మంది సభ్యులే హాజరయ్యారు. దీంతో ప్రిసైడింగ్ ఆఫీసర్ అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్టు ప్రకటించారు.

కార్యాలయం వద్ద హైడ్రామా..

అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కొన్ని గంటల పాటు మున్సిపల్ కార్యాలయం వద్ద హైడ్రామా నెలకొన్నది. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొక్కు నాగేశ్వరరావు అనే కౌన్సిలర్‌ను అపహరించారని, బీఆర్ఎస్ నుంచి గెలిచిన మరో ఐదుగురు కౌన్సిలర్లను ప్రత్యేక క్యాంప్‌కు తరలించారని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ కార్యాలయాల అద్దాలు పగులగొట్టినా, తమను దూషించినా, ఎమ్మెల్యే కనకయ్య, పోలీసులు నోరు మెదపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొక్కు నాగేశ్వరరావు భార్య వెంకటలక్ష్మితో కలిసి ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే కనకయ్య అనుచరులపై ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే కనకయ్యపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్టు సీఐ కరుణాకర్ తెలిపారు. కాగా, కిడ్నాప్‌కు గురైన కౌన్సిలర్ నాగేశ్వరరావును కొన్ని గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యే కనకయ్య అనుచరులు తిరిగి ఇల్లెందు పోలీస్‌స్టేషన్ ఎదుట వదిలిపెట్టినట్టు సమాచారం.

తెలంగాణ సర్కారు త్వరలో కూల్తది

మొదటిపేజీ తరువాయి...

అయినా ఇప్పుడు దాన్ని ఎన్నికల అంశంగా మార్చాలని చూస్తున్నదని విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ ఏపీకి విలన్. ఏపీకి పదేండ్లు ప్రత్యేక హోదా ఇస్తామని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో కచ్చితంగా చెప్పారు. అది కంటితుడుపు హామీ అయ్యింది. ఏపీపై కాంగ్రెస్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే విభజన చట్టంలో ప్రత్యేక హోదా ఎందుకు పెట్టలేదు? ఏపీ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ అర్థంపర్థం లేకుండా మాట్లాడుతున్నారు. 2004లో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, పదేండ్ల తర్వాత అశాస్త్రీయంగా రాష్ట్రాన్ని విభజించింది. కుటుంబ వ్యవహారంలో తల దూర్చడం కాంగ్రెస్ డర్టీ పాలిటిక్స్‌కు నిదర్శనం. గత ఎన్నికల్లో ఏపీలో కాంగ్రెస్‌కు నోటా కంటే తక్కువ ఓట్లు పార్టీకి వచ్చాయి. కాంగ్రెస్ దుష్ట పరిపాలనకు ఏపీ పెద్ద బాధిత రాష్ట్రం. జాతీయస్థాయిలో కూడా కాంగ్రెస్ కనుమరుగు కావడం ఖాయం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 40 సీట్లకు మించి రావు. 2029 నాటికి కాంగ్రెస్ ముక్త భారత్ తథ్యం' ధ్వజమెత్తారు.